క్లుప్తంగా

నేడు స్వామి వారి కల్యాణం

రేగొండ: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా నేడు (బుధవారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

నియామకం



మొగుళ్లపల్లి: మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన మంద రమేశ్‌ను ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు రీజనల్ ఇన్‌చార్జ్ మేకల సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా కమిటీకి, రీజినల్ ఇన్‌చార్జ్, రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

రేగొండ: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై సందీప్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం వాహనదారులకు ఎస్సై సందీప్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడపడం, హెల్మెట్ లేని ప్రయాణం, అతి వేగం ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 10 మంది వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై దివ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శ్రీపాదరావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మ్యాచ్‌లో వరుసగా మూడు సిక్స్‌లు కొట్టిన అస్లాం, టోర్నమెంట్‌లో అత్యధిక స్కోర్ చేసిన రాజేందర్, నగునూరి రమేశ్‌లకు రూ.వెయ్యి చొప్పు నగదు ప్రోత్సాహక బహుమతిని మంగళవారం చెమ్మళ్ళ సుధీర్ అందజేశారు. వారి వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకుడు పవన్‌శర్మ, లేతకరి రాజబాపు, రవి, కామెంటరీ సదువలి ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



మొగుళ్లపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి పోలీసులు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన కాసుబోజుల వీరచారి ఈ నెల 12న సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి ఎస్సై అశోక్ మంగళవారం అప్పగించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

పలిమెల: శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని ఎస్సై రమేశ్ అన్నారు. పలిమెల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జంగిలి రమేశ్ మంగళవారం మండలంలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కాటారం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన మండల పరిధి చింతకాని క్రాస్ సమీపంలోని వాగు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని ధన్వాడ గ్రామానికి చెందిన తుల్సెగారి తిరుపతి, సమ్మయ్య, రాజయ్య ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి నుంచి కాటారం వైపుగా వస్తున్నారు. ఇదే క్రమంలో కాటారం వైపుగా వస్తున్న ఇసుక లారీ బైక్‌ను వెనక నుంచి ఢీ కొనడంతో ముగ్గురు కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఒకరికి గాయాలు

గణపురం: మండలంలోని చెల్పూరు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూరు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో బొగ్గులోడ్‌తో రోడ్డు పక్కన నిలిపిఉన్న టిప్పర్ లారీని పరకాల నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న కారు అతివేగంతో ఢీ కొట్టింది. కారు నడుపుతున్న ములుగు జిల్లా మేడారానికి చెందిన గండికోట అఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భూపాలపల్లి ప్రధాన ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అందని పరిహారం

- అటకెక్కిన 'మైనర్ టు మేజర్'
- అర్హత జాబితా సిద్ధమైనా కానరాని పరిహారం
- ఆందోళనలో నిర్వాసితులు

మల్హర్: తాడిచర్ల బొగ్గు గనుల ఏర్పాటు సమయంలో మైనర్లుగా ఉన్న వారు పరిహారం ఇచ్చే సమయానికి అర్హత సాధించలేకపోయారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపులో భాగంగా అధికారుల నివేదిక ప్రకారం కాపురం గ్రామంలో ఇళ్ల సేకరణ నోటిఫికేషన్ నాటికి నిర్వాసితుల్లో 2017 జూలై 31 నాటికి, తాడిచర్ల ఎస్సీకాలనీలో 2008 జూన్ 18 కటాఫ్ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, పెళ్లికానీ అమ్మయిలు ఆర్‌అండ్‌ఆర్‌కు అర్హులుగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా తాడిచర్ల ఎస్సీ కాలనీలో 69, కాపురంలో 202 మందిని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ లబ్ధిదారులను గుర్తించారు. 134 మంది పరిహారం ఇవ్వడంతో పాటు ప్లాట్లను సైతం అందించారు. ఇంకా 137 మందికి ప్లాట్లు ఇవ్వడంలో పెండింగ్ ఉన్నాయి. ఈ క్రమంలో పరిహారం చెల్లించే కటాఫ్ తేదీ నాటికి 18 ఎళ్లు నిండిన వారికి నాయ్యం చేయాలని రెవెన్యూ, జెన్‌కో అధికారులకు విన్నవించారు. దీంతో జెన్‌కో, రెవెన్యూ అధికారులు ఓ తేదీని నిర్ణయించి, దీంతో మైనర్ టూ మేజర్ జాబితాను సిద్ధం చేసి జెన్‌కో ఉన్నతాధికారుల ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపించారు. పీడీఎఫ్ కటఅఫ్ డేట్ నాటికి 18 సంవత్సరాలు లేని వారు కాపురం, తాడిచర్ల ఎస్సీకాలనీలో 54 మంది ఉన్నట్లు ఉన్నట్లు గుర్తించి, సదరు లబ్ధిదారులను గుర్తించి, మైనర్ టూ మేజర్ జాబితా తయారు చేసి నోటిఫికేషన్ విడుదల చేశారు.



తాడిచర్ల ఎస్సీకాలనీ విలేజ్

కదలని ఫైల్

2023 సంవత్సరం మే 11న తాడిచర్ల గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో తాడిచర్ల ఎస్సీ కాలనీలో 36 మంది, కాపురం గ్రామంలో 18 మందితో కూడిన మైనర్‌టూ మేజర్ జాబితాను ప్రచురించారు. సదరు జాబితా ఆమోదం కోసం జెన్‌కో ఉన్నతాధికారులు పంపించారు. ఏళ్లు గడుస్తున్న కాని నిబంధనల ప్రకారం తాము పరిహారానికి అర్హులమైనా తమకు ఎందుకు పరిహారం అందటం లేదని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. అన్ని రకాల పరిహారాలు చెల్లించిన జెన్‌కో 18 ఏళ్లు నిండిన మైనర్ టు మేజర్‌గా మారిన తమను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. తమకు త్వరలోనే పరిహారం అందుతుందని ఆశా పడ్డ నిర్వాసితులకు సంవత్సరాలు గడుస్తున్న ఫైళ్లు కదలకపోవడంతో మొండి చేయ్యి ఎదురైయిందని వాపోతున్నారు. తమను మభ్య పెట్టాడానికే మైనర్ టూ మేజర్ నోటిఫికేషన్ కార్యాలయాల్లో ప్రచురించి, జెన్‌కో, రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు. పరిహారం విషయమై పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదన్నారు. అసలు తమకు పరిహాం ఇస్తారా లేదా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



మైనర్ టూ మేజర్ జాబితా నోటిఫికేషన్ జాబితాలో నాపేరు వచ్చిందని, పరిహారం ఎప్పుడు ఇస్తారు అని అధికారులకు పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు మమ్మల్ని గుర్తించి, పరిహారం ఇయ్యాలి.

ఇందారపు నరేష్, తాడిచర్ల ఎస్సీ కాలనీ, నిర్వాసితుడు, మల్హర్

మాపై దృష్టి పెట్టండి



ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో కటాఅఫ్ తేదీ నాటికి 18 సంవత్సరాలు లేవని ప్యాకేజీలో నాపేరు రాలేదు. నాయ్యం చేయాలని రెవెన్యూ, జెన్‌కో అధికారులకు విన్నవించుకున్నాం. దీంతో మైనర్ టూ మేజర్ జాబితాలో పేరు నమోదు చేశారు. పరిహారం కోసం అధికారుల వద్దకు వెళ్తె పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు మాపై దృష్టిపెట్టి పరిహారం ఇవ్వాలి

- రఘు, తాడిచర్ల ఎస్సీకాలనీ, నిర్వాసితుడు, మల్హర్

సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలం కొత్తపల్లి(ఎస్ఎం) గ్రామ శివారులోని సోలిపేట తాటి వనం (కల్లు మండువా) వద్ద నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 82 మంది కల్లు గీత కార్మికులకు ఎమ్మెల్యే కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గౌడన్నలు తమ వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు తీసే క్రమంలో ఆకస్మికంగా ప్రమాదాలు జరిగి చనిపోవడం, శాశ్వత వైకల్యానికి గురి కావడం జరుగుతుందన్నారు. ఇది గమనించిన సీఎం రేవంత్ రెడ్డి వారి భద్రత కొరకు సేఫ్టి కిట్లను తయారు చేయించి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

గణపురం: మహిళ సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం గణపురం మండలకేంద్రంలో స్వర్ణభారతి మహిళా సమాఖ్య మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కోటి మంది మహిళాలను కోటీశ్వర్లు చేయాలని సంకల్పంతో పని చేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి చెందితేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో మహిళ సమైఖ్య భవనాన్ని నిర్మిస్తున్నాని వివరించారు. మహిళ సమైక్య భవనాలు లేని పలు గ్రామ పంచాయతీలలో కూడా నూతన భవనాలు నిర్మించుటకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో గతంలో మహిళా సమైక్య భవనం నిర్మించడానికి పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంబంధిత సిబ్బంది కోరడంతో రూ.50 లక్షల నిధులను వెంటనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కాపర్‌వైరు చోరీకి యత్నం

గణపురం: మండలంలోని ఓసీ-3 ప్రాజెక్టులో డంపింగ్ యార్డు వద్ద కాపర్ వైర్ చోరీకి పాల్పడుతున్న ఒక వ్యక్తిని సింగరేణి సెక్యూరిటీ గార్డులు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. మణుగూరుకు చెందిన లారీ డ్రైవర్ కనకయ్య మంగళవారం తెల్లవారు జామున కాపర్ వైర్‌ను దొంగలించే ప్రయత్నంలో సింగరేణి సెక్యూరిటీ విభాగం గుర్తించి పోలీసులకు అప్పగించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

చిట్యాల: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



టేకుమట్ల: మాట్లాడుతున్న ఆర్డీఓ రవి



కాళేశ్వరం: ఏన్కపల్లి గ్రామసభలో పాల్గొన్న ప్రజలు



కొనసాగుతున్న కార్మికుల దీక్ష



భూపాలపల్లి రూరల్: దీక్షలను ప్రారంభిస్తున్న బందు సాయిలు



గణపురంలో..

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని సర్కిల్ ఆఫీస్ వద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ చేపట్టిన దీక్షలు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు ముఖ్య అతిథిగా హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆర్టిజన్ కార్మికులను వారి విద్యా అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జేఏసీ నాయకులు తిప్పారపు రాజు కోసారి భాస్కర్, నవీన్ కృష్ణమూర్తి, సాంబమూర్తి, రాజేందర్, బాపూరావు, భిక్షపతి, సమ్మయ్య, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణపురం: విద్యుత్ సంస్థలల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ ప్రాజెక్టు వద్ద ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు రెండవ రోజు కొనసాగాయి. కేటీపీపీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వజీర్, స్టేట్ ఫైనాన్షియల్ సెక్రటరీ సుంకరి సదానందం దీక్షను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో లెక్కలు చూపింది కాని పర్మినెంట్ చెయ్యలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన మాట ప్రకారం ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సర్వే

కాటారం: పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా పైలట్ గ్రామంగా ఎంపికైన కాటారంలో మంగళవారం ట్రాన్స్‌కో సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ పథకంలో భాగంగా గ్రామంలో ఇంటింటా సోలార్ విద్యుత్ సిస్టం ఉచితంగా ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం సిబ్బంది ప్రతీ ఇంటికి సంబంధించిన విద్యుత్ బిల్లు, వినియోగదారుడి ఆధార్‌కార్డు, బ్యాంక్ వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మొదటి విడతలో భాగంగా కాటారంలో 1080 ఇళ్లకు, 229 వ్యవసాయ బోర్లకు సోలార్ విద్యుత్ ఉచితంగా అమర్చనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకొని ప్రతీ ఒక్క ఇంటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



కాటారంలో సర్వే చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

- డాక్టర్ కల్యాణి

పలిమెల: కీటక జనిత అంటు వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ కల్యాణి సూచించారు. మంగళవారం అంబటిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని మండంలోని సర్వాయిపేట, పలిమెల, పంకెన గ్రామపంచాయతీల్లో సాంస్కృతిక కళా బృందం సభ్యురాలు శిరీష ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్యాణి మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి పాటించాలన్నారు. చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రఘురామన్, హెచ్ఈఓ సోనాజీ, హెల్త్ సూపర్‌వైజర్ మాషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన నీరటి రాధమ్మ, చిట్యాలకు చెందిన బుర్ర నవ్య, ముసాపూరి లక్ష్మీ, చల్లగరిగకు చెందిన మేదరి లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన గురుకుంట్ల కిరణ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడిని పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు చింతల రమేష్, పువ్వాటి హరికృష్ణ, జంబుల చంద్రమౌళి, వీణవంక శ్రీదేవి, కోడెల రాయమల్లు, ఏలేటి రాజు, ఉప్పుల కిరణ్, మేరుగు నాగేందర్, రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు సంగి రవి తండ్రి సంగి రత్నం, బిల్లకంటి రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కొలిపాక రాజయ్య, నేరేళ్ల రామకృష్ణగౌడ్, శ్రీనివాస్, చంద్రయ్య, ప్రభాకర్‌రావు, తోట సాగర్, కోటి, చరణ్, రమేష్, సారయ్య ఉన్నారు.



చిట్యాల: పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నాలుగు సంక్షేమ పథకాలపై జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కాగా పలు గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాని వారు అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చిట్యాల, గణపురం, గోరికొత్తపల్లి మండలాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ హాజరై మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాని వారు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



గణపురం: కర్కపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, పక్కన కలెక్టర్ రాహుల్‌శర్మ



మల్హర్: రేషన్‌కార్డుకు దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు



మొగుళ్లపల్లి: నర్సింగపూర్‌లో..



పలిమెల: దమ్మూరులో..

ప్రభుత్వ పథకాల్లో అనర్హులకు పెద్దపీట



మాట్లాడుతున్న కిరణ్

కాటారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికలో అధికారులు అనర్హులకు పెద్దపీట వేశారని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో రైతువేదిక ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరులో అర్హులైన నిరుపేదలకు మొండిచేయి చూపించారని పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల డ్రామా ముందుకు తీసుకొచ్చారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మానెం రాజబాబు, మహేందర్ తదితరులు ఉన్నారు.

'గర్భగుడి తలుపులు మూసి పాట చిత్రీకరణ చేయలేదు'

- కాళేశ్వరాలయ ఈఓ మారుతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం గర్భగుడిలో గాయని మధుప్రియ శివు నిపాటపై ప్రైవేట్ వీడియో చిత్రీకరణ గర్భగుడి తలుపులు మూసి చేయలేదని ఈఓ మారుతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను కుంభాభిషేకం నిర్వహణలో భాగంగా శృంగేరి పీఠాధిపతిని ఆహ్వానించుటకు దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశంతో ఆర్జేసీ రామకృష్ణరావు ఆధ్వర్యంలో దేవస్థానం అర్చకులతో కలిసి కర్ణాటకలోని బళ్లారికి వెళ్లినట్లు తెలిపారు. ఆ సమయంలో మధుప్రియకు సంబంధించిన వారు దేవాలయం బయట ఆవరణలో, గోదావరి నది వద్ద శివరాత్రికి సంబంధించిన భక్తి పాట చిత్రీకరించుటకు అనుమతి ఇవ్వవలసినదిగా సెల్ ఫోన్ ద్వారా కోరినట్లు పేర్కొన్నారు. గర్భాలయంలో దేవతా మూర్తుల వద్ద పాట చిత్రీకరించుటకు వీలులేదని వారికి తెలిపానన్నారు. దేవస్థానం కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మధుప్రియ గర్భాలయం లోపల లింగాల వద్ద భక్తి పాట చిత్రీకరించడం జరిగినట్లు తెలిపారు. ఆ సమయంలో దేవాలయంలో లోపల డ్యూటీలో ఉన్న అర్చక స్వామి తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. దేవస్థానం కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మధుప్రియ చిత్రీకరించుటకు అవకాశం ఇచ్చిన అర్చక స్వామి ఏ.రామకృష్ణశర్మకు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. దేవాలయం తలుపులు మూసి భక్తులకు అసౌకర్యం కల్పించిన విషయమై అర్చక స్వామి, డ్యూటీ సిబ్బందిని విచారించినట్లు తెలిపారు. దేవాలయంలో పాట చిత్రీకరించిన సమయంలో దేవాలయం తలుపులు వేయడం గానీ, భక్తులను అసౌకర్యానికి గురి చేయడం గాని జరగలేదని స్పష్టం చేశారని పేర్కొన్నారు.

'దేవస్థానం ఘటన బాధ్యులను సస్పెండ్ చేయాలి'

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానంలో గాయని మధుప్రియ గర్భగుడిలో తలుపులు మూసి ప్రైవేట్ ఆల్బమ్ పాట చిత్రీకరణ చేసిన ఘటన బాధ్యులను సస్పెండ్ చేయాలని ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాట చిత్రీకరణపై హిందూ చట్టం ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకొని పాటను నిషేధించాలని డిమాండ్ చేశారు. గర్భగుడిలో తలుపులు మూయించి భక్తులకు లోనికి పోకుండా అసౌకర్యాలకు గురి చేశారన్నారు. ఈ ఘటనపై ఆలయ ఈఓతో పాటు సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేకుంటే ప్రజాసంఘాలు, హిందూ సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆదర్శనగర్ కాలనీలో శ్రమదానం



కాటారం: మండలంలోని ఆదర్శనగర్ కాలనీలో మంగళవారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాలనీ కమిటీ, కాలనీవాసులు శ్రమదానం చేశారు. కాలనీ రహదారుల వెంట ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలిగించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కన్వీనర్ ఆత్మకూరి కుమార్‌యాదవ్, మహేశ్, గడ్డం కొంరయ్య, రాంనారాయణ, మధు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410